తేదీ 20.10.2003, అవతార ప్రకటన దినోత్సవం, సాయికుల్వంత్ హాలు

# ప్రాచీన సంస్కృతిని పునరుద్ధరించండి!

పరమ పావనమైన భారతావనియందు
సహనమన్నదె మనకు చక్కదనము
వ్రతములన్నిటియందు వన్నె గాంచినయట్టి
ఘన సత్యశీలమే కఠిన తపము
మధుర భావంబేది మన దేశమందున్న
మాతృభావము కంటె మాన్యమెద్ది?
ప్రాణంబు కంటెను మానంబె ఘనమను
మన దేశ నీతిని మంటగలిపి
నేటికిచ్చిరి పరదేశ నీతులరసి
వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తె
ఔర! ఏమందు భారతపాలనంబు
ఏనుగెట్టుల తన బలమెఱుగ లేదో
అట్టులైనారు మన భారతీయులు నేడు

ప్రేమస్వరూపులైన యువకులారా! ఈ సంస్థలో చేరి చక్కని ఆదర్శాన్ని నిరూపించిన మీకు ఎట్టి ఆనందాన్ని అందించిననూ చాలదు. ఇలాంటి సంస్థలు ఒకటి, రెండు ఉండినను చాలు; పవిత్రమైన ప్రాచీన భారతీయసంస్కృతిని పునరుద్ధరించవచ్చును. పవిత్రమైన సేవాకార్యక్రమాలను నిర్వహించడంవలన మీ హృదయాలు కూడా పవిత్రంగా మారిపోయినవి. ఇట్టి పవిత్రమైన సేవలను గ్రామగ్రామమునందూ, వీధివీధియందు సలిపిన భారతీయుల హృదయంలో ప్రాచీన సంస్కృతి పునఃప్రతిష్ఠింపబడగలదు.

srisathyasaivachanamrutam

భారతీయులు ఈనాడు పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి అపవిత్రమైన చర్యలకు పాల్పడుతున్నారు. భారతీయ సంస్కృతి అత్యంత ప్రాచీనమైనది అయినప్పటికీ ఆధునిక సమాజానికి దీని ఆవశ్యకత ఎంతేని ఉన్నది.

మీ సంస్థలయొక్క పెద్దలు కొంతమంది నావద్దకు వచ్చి, గ్రామసేవలను గురించి తగిన మార్గదర్శక సూత్రాలను ప్రసాదించవలసిందిగా కోరినారు. రేపటి దినము నేను హైదరాబాదు యువకులను, ఇతరులను పిలిచి మాట్లాడి దానికి తగిన చర్యలు తీసుకుంటాను. ఒకానొక సమయంలో భాగ్యనగరమని పేరు గాంచిన హైదరాబాదులో ఈనాడు ప్రజలు ప్రాచీన సంస్కృతియందు విశ్వాసము కోల్పోయినారు. ఈనాటి ప్రపంచము చాలా విచిత్రముగా మారిపోతున్నది. ఆధ్యాత్మికవిషయాలను బోధించడం, దానికి విరుద్ధమైన చర్యలను ఆచరించడం ... పెద్దపెద్ద పట్టణాలలో ఇది సహజమైపోయింది. పట్టణాలలో నివసించే పెద్దలు, విద్యావంతులు మన ప్రాచీనసంస్కృతిని పూర్తి విస్మరించి ఆధునికత పేరిట పెడమార్గం పడుతున్నారు. ప్రాచీన సంస్కృతిపట్ల మన యువకులలో ఉన్న ఆసక్తి, ఉత్సాహము ఇంకెక్కడా కానరావడం లేదు. ఈ పిల్లలయొక్క హృదయాలు ఎంత పవిత్రమైనవో మన సంస్కృతి ఔన్నత్యాన్ని గుర్తించినవారికి మాత్రమే అర్థమౌతుంది. ఈనాడు మన ప్రాచీనసంస్కృతిని గురించి గ్రామ గ్రామాలలోను, పల్లెపల్లెలోను ప్రచార ప్రబోధలు సల్పుట అత్యవసరము. అయితే, పల్లెల్లో నివసించేవారికి ఈ సంస్కృతిని అభివృద్ధి చేయడానికి తగిన ఉత్సాహము ఉండినప్పటికీ వారికి తగిన ప్రోత్సాహము లేక వారు దీంట్లో పాల్గొనలేకపోతున్నారు. మన ప్రాచీనసంస్కృతిని ప్రజల హృదయాలలో నాటడానికి నేను తగిన ఉత్సాహ ప్రోత్సాహములను అందించడమేకాకుండా, మీకు కావలసిన సహాయం కూడా చేస్తాను. మా కళాశాలలో సీట్లు కూడా ఇస్తాను. ఇదంతా మీదే! ఈ ఇన్‌స్టిట్యూట్ మీదే! నేనే మీవాడను. కనుక, ఇక్కడ మీకు తగినటువంటి అధికారము ఉన్నది. మీకు ఏ సహాయము కావలసినప్పటికీ తప్పక చేయటానికి నేను సంసిద్ధంగా ఉన్నాను. మీరు పల్లెలకు ప్రయాణించి పవిత్రమైన సేవలు చేసే నిమిత్తం నేనొక బస్సును కూడా ఇస్తాను.



sri sathyasaivachanamrutam

రేపటి దినము నేను మీ అందరితో చేరి మరికొన్ని విషయాలను గోప్యంగా చర్చించవలసి ఉన్నది. మీరు నిరాశకు ఏమాత్రం చోటివ్వక ఉత్సాహముతో ముందంజ వేయండి. రేపటి దినము ఆనందముగా స్వామికొరకు కాచుకొని ఉండండి. నేను ఏ నిమిషమునకు కావలసినా మీదగ్గరకు రాగలను. మీరు ఎలాంటి పరిస్థితిలోనైనా భగవన్నామస్మరణను మాత్రం మానకండి. భగవన్నామమే మిమ్మల్ని భవసాగరమును దాటించే దృఢమైన నావ అని విశ్వసించండి. మీ సంస్థకు తగిన బలమును నేను అందిస్తాను. కనుక, మీరు ఉత్సాహముతో సేవలలో పాల్గొనడానికి సంసిద్ధులై ఉండండి.

**రాజకీయాలకు దూరంగా ఉండండి**

ప్రేమస్వరూపులైన యువకులారా! ఈనాడు మీరు ప్రదర్శించిన కార్యక్రమాలను చూస్తుంటే నన్ను నేనే మరచిపోయాను. రేపటిదినము నేను మీతో కలసి మీకు కావలసినంత ఆనందాన్ని అందిస్తాను.

(శ్రీవారు 'ప్రేమముదిత మనసె కహో...' అనే భజన కీర్తనను పాడి భక్తులచేత పాడించిన తరువాత తమ దివ్యోపన్యాసాన్ని కొనసాగిస్తూ...)

ప్రేమస్వరూపులారా! మీ కార్యక్రమములందు రాజకీయాలకు ఏమాత్రం చోటివ్వకండి. వాటికి సంబంధించిన విషయాలను మీరు ప్రదర్శించకండి. రాజకీయాలపట్ల ద్వేషముగాని, లేక సన్నిహిత సంబంధముగాని కలిగించుకొనకుండా మీ మార్గమును మీరు అనుసరించండి. నిరంతరం భగవన్నామాన్ని స్మరించుకుంటూ కాలాన్ని సార్థకం గావించుకోండి. స్వార్థ రహితమైన సేవలలో పాల్గొని మీ జన్మను తరింపజేసుకోండి.

(తేదీ 20.10.2003, అవతార ప్రకటన దినోత్సవం, సాయికుల్వంత్ హాలు)

sri sathyasai vachanamrutam